# మాజీ రాష్ట్రపతికి సాదర స్వాగతం



తిరుమల,సెప్టెంబర్ 17ప్రభాతవార్తప్రతినిధి:
భారత మాజీరాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ఆదివారం రాత్రి తిరుమలకు చేరుకోవడంతో సాదర స్వాగతం లభించింది, టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఈఓ ఏవి ధర్మారెడ్డి, వసతి కల్పన డిప్యూటీ ఇఒ పి.హరీంద్రనాథ్ పుష్పగుచ్ఛంతో స్వాగతం పలికారు.



తిరుపతి - చిత్తూరు
తెలుగు జాతీయ దినపత్రిక
వార్త

# నాటుతుపాకీ స్వాధీనం.. నలుగురి అరెస్ట్

కుప్పం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త



మండలంలోని గుడ్లనాయనపల్లి వద్ద వన్యప్రాణులను వేటాడేందుకు అక్రమంగా ఉంచుకున్న నాటు తుపాకీని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్ట్ చేసినట్లు అర్బన్ సిఐ శ్రీధర్ తెలిపారు. జిల్లా ఎస్పీ రిషాంత్ రెడ్డి, డిఎస్పీ సుధాకర్‌రెడ్డి ఆదేశాలతో కుప్పం - వేపనపల్లి మార్గంలో తనిఖీలు చేస్తు ఒడగా గంగాపురంకు చెందిన రాజు, కృష్ణమూర్తి, యానాదిపల్లికి చెందిన రాము, మురుగేష్‌లు నాటుతుపాకీతో పట్టుబడ్డారన్నారు. వీరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎస్సై శివకుమార్ పాల్గొన్నారు.

## గణపయ్య బ్రహ్మోత్సవాలకు

# సర్వం సిద్ధం

**-వేకువ జామున 4 గంటల నుండే దర్శనం**
**-నేడు స్వామివారికి మంత్రి పట్టు వస్త్రాల సమర్పణ**



కాణిపాకం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:
సత్య ప్రమాణాలకు నెలవైన కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామివారి బ్రహ్మోత్సవాలకు దేవస్థానం సర్వం సన్నద్ధమైంది. కాణిపాకం దేవస్థానంలో సోమవారం నుండి అక్టోబర్ 8 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి. ఈమేరకు ఉత్సవాలను గతంలో వలె అంగరంగ వైభవంగా నిర్వహించడానికి దేవస్థానం అన్ని ఏర్పాట్లు చేపట్టింది. ఇందులో భాగంగా ఆస్వేటి మండపం, సుపథమండపంలలో రంగవల్లికలను అందంగా తీర్చిదిద్దారు. ఉత్సవాల సందర్భంగా భక్తులందరికి త్వరితగతిన దర్శనం కల్పించేందుకు వీలుగా ఆలయం వద్ద వేర్వేరుగా ప్రత్యేక క్యూలైన్లను సిద్ధం చేశారు. ఆలయ దర్శనార్థం వచ్చే భక్తులందరికి స్వామివారి ప్రసాదాలు అందించేందుకు కావలసిన లడ్డూ, ప్రసాదాలను సిద్ధం చేసి వుంచారు. వినాయక చవితి సందర్భంగా ఉభయదారులచే సోమవారం వేకువజామున స్వామివారికి ప్రత్యేకఅభిషేకం అనంతరం 4 గంటల నుండి భక్తులకు ఆలయంలో స్వామివారి దర్శనం కల్పించనున్నారు. దేవస్థానంలో గతంలో వలె బ్రహ్మోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించడానికి దేవస్థానం ఛైర్మన్ ఎ.మోహన్‌రెడ్డి, ఈఓ ఎ.వెంకటేశుల ఆధ్వర్యంలో భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఇదిలా వుండగా వినాయచవితి సందర్భంగా స్వామివారికి ప్రభుత్వం తరపున రాష్ట్ర మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పట్టువస్త్రాలను సమర్పించనున్నారు.

### సర్వాంగ సుందరంగా అలంకరణ



బ్రహ్మోత్సవాల సందర్భంగా కాణిపాకం ఆలయాన్ని సర్వాంగ సుందరంగా అలంకరించారు. ఆలయంను రంగురంగుల విద్యుద్దీపాలతో అలంకరించడంతో పాటు వివిధ రకాల విదేశీ, స్వదేశీ జాతీ పుష్పాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. నూతన ఆలయంతో పాటు ప్రధాన ఆలయంలోని అన్వేటి మండపం, సుపథమండపంలను పుష్పాలు, అరటి చెట్లు మామిడి తోరణాలతో అలంకరించారు.

## స్వామి ఉత్సవాలకు

# విశ్వక్సేనుడి పర్యవేక్షణ

**వేడుకగా అంకురార్పణ -భక్తులకోసం విస్తృత ఏర్పాట్లు**
**-నేటి నుండి వాహనసేవలు**









ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:
వైకుంఠం నుంచి శ్రీనివాసుడు వేంకటాద్రిపై వెలసిన తొలిరోజుల్లోనే బ్రహ్మదేవుడు లోకకల్యాణం కోసం జరిపించిన ఉత్సవాలకు బ్రహ్మోత్సవాలు అని పేరు వచ్చాయి. ఏడుకొండలదేవుడికి తొమ్మిదిరోజులు భక్తిశ్రద్ధలతో, వైఖానస ఆగమోక్తంగా నిర్వహించే ఈ బ్రహ్మోత్సవాలకు తొలిఘట్టంగా ఆదివారం రాత్రి అంకురార్పణతో శ్రీకారం చుట్టారు. నేటి రాత్రి తొలివాహనంగా పెద్దశేషవాహన సేవతో మొదలై చివరగా 26వతేదీ ఉదయం చక్రస్నానంతో ఉత్సవాలు ముగుస్తాయి. భక్తుల రద్దీకి తగ్గట్లు టిటిడి పెద్దలు, అధికారులు అన్ని రకాల ఏర్పాట్లు, సౌకర్యాలు కల్పించారు. ఆలయ మాఢవీధుల్లో ఉండే భక్తులకు గ్యాలరీలు, తాగునీరు, అన్నప్రసాదాలు, మజ్జిగ,వైద్యసేవలు అన్నీ అందుబాటులో ఉంచారు. ఆదివారం సాయంత్రం శ్రీవారి సేనాధిపతి శ్రీవిశ్వక్సేనులు వసంతమండపానికి చేరుకుని అంకురార్పణ ఘట్టాన్ని పర్యవేక్షించారు. కార్యక్రమంలో టిటిడి ఛైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి, ఇఒ ఏవి ధర్మారెడ్డి దంపతులు, ఆలయ ప్రధాన అర్చకులు వేణుగోపాలదీక్షితులు, కృష్ణశేషాచల దీక్షితులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కారు శ్రీహరి, అర్చకులు పాల్గొన్నారు.

**-తొలివాహనం "పెద్దశేషవాహనం":**
బ్రహ్మోత్సవాల్లో మొదటిరోజురాత్రి నేడుతొలి వాహనంగా ఏడుతలల శేషునిపై ఉభయనాంచారులతో కలసి విహరిస్తారు.స్వామిని నిత్యం కొలిచి సేవించే వారిలో శేషుడు ఒకడు. ఈ శేష వాహనం దాస్యభక్తికి నిదర్శనం,

**-"చిన్నశేషవాహనం":**
రెండవరోజు మంగళవారం ఉదయం మలయప్ప స్వామివారు మాత్రమే ఐదుతలల చిన్నశేషవాహనంపై దర్శనమిస్తాడు.

# జగన్‌ప్రభుత్వానికి త్వరలో చరమగీతం

**-చంద్రబాబు ఆరోగ్యంకోసం మృత్యుంజయ హోమం**



తిరుపతి,సెప్టెంబర్ 17ప్రభాతవార్త:
తెలుగుదేశం అధినేత చంద్రబాబునాయుడుపై కక్షతో అక్రమంగా కేసు నమోదు చేసి జైలుకు పంపిన సిఎం జగన్మోహన్‌రెడ్డి ,వైసిపి ప్రభుత్వా నికి త్వరలో చరమగీతం పాడుతారని టిడిపి నేతలు అన్నారు. చంద్రబాబు ఆయురారోగ్యాలతో తిరిగి రావాలని దేవుని ప్రార్థిస్తూ తెలుగుదేశం పార్టీశ్రేణులు మృత్యుంజయ హోమం నిర్వ హిం చారు. రిలేనిరాహారదీక్షలో భాగంగా ఆదివారం ఉ దయం తిరుపతిలోని పాతమున్సిపల్ కార్యాల యంవద్ద మృత్యుంజయహోమం చేశారు. టిడిపి నాయకులు ఎం.సుగుణమ్మ, నరసింహయాదవ్, వి.పుష్పావతి యాదవ్, సూరా సుధాకర్‌రెడ్డి, మబ్బుదేవనారాయణరెడ్డి, ఆర్‌సి మునికృష్ణ, దం పూరి భాస్కర్, పులిగోరు మురళి, సింగంశెట్టి సుబ్బరామయ్య, రవి,ఊకా విజయ కుమార్, వట్టికుంట చిన్నబాబు. మహేష్‌యాదవ్, కుమారమ్మ, ఆర్‌పి శ్రీనివాసులు, హేమ, వసంతమ్మ, సూర్య కుమారి,జనసేన పార్టీ నాయకులు కిరణ్‌రాయల్, రాజారెడ్డి, సుభాషిణిలతో కలసి ఈ హోమం జరిపించారు.

## బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై

# వివిధ శాఖల అధికారులతో సమీక్ష



తిరుపతి రవాణా, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త
తిరుమల సాలకట్ల బ్రహ్మోవత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో తిరుపతి ఎంపి మద్దిల గురుమూర్తి వివిధ శాఖల అధికారులతో తిరుపతిలోని తమ కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో భాగంగా బ్రహ్మోత్సవాలకు ఒక రోజుకు సుమారు లక్ష నుంచి రెండు లక్షల మంది విచ్చేసే అవకాశం ఉందని భక్తులు ఎలాంటి అసౌకర్యం లేకుండా అన్ని వసతులు కల్పించాలని అధికారులని కోరారు. భక్తుల సౌకర్యాల విషయంలో ఎలాంటి నిర్లక్ష్యం వహించరాదని వారికి సూచించారు. సాలకట్ల, నవరాత్రి బ్రహ్మోత్సవాల సందర్భంగా భక్తుల సౌకర్యార్థం తీసుకొన్నటువంటి చర్యలు ఏర్పాట్లపై చర్చించారు. ఈ చర్చలలో భాగంగా ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ వారు 1400 సర్వీసులు అందుబాటులోకి తీసుకొచ్చామని గరుడ సేవ నిమిత్తం భక్తుల రద్దీ దృష్ట్యా 2600 సర్వీసులు అందుబాటులో తీసుకువస్తున్నామని గత ఏడాదితో పోలిస్తే ఈ సారి 64 ఎలక్ట్రిక్ వాహనాలను అందుబాటులో తెచ్చామని వివిధ దశలలో బస్సుల యొక్క సామర్థ్య పరీక్షలు నిర్వహించామని బాలాజీ బస్సు స్టాండ్ నుంచి టౌన్ సర్వీస్ నిమిత్తం సుమారు 70 సర్వీసులతో పాటు భక్తుల సౌకర్యార్థం మరిన్ని బుకింగ్ కౌంటర్లు అందుబాటులో తెచ్చామని గరుడ సేవ నిమిత్తం ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు బ్లాకింగ్ పాయింట్ దగ్గర నుంచే బస్సు సర్వీసులు నడుపుతామని ఆర్టీసి అధికారులు విన్నవించారు. అదే విధంగా ప్రస్తుతం ఒక రోజుకు తిరుపతి రైల్వే స్టేషన్‌కు వచ్చే 72 నుంచి 75 రైళ్లు కాకుండా అదనంగా రెండు నుంచి మూడు రైలు సర్వీసులుతో పాటుగా అదనపు బోగీలను జోడిస్తున్నామని ప్రయాణికులకు అసౌకర్యం లేకుండా రైల్వే స్టేషన్‌లో ఏర్పాట్లు చేశామని తెలియజేసారు. అలాగే విమానాశ్రయ అధికారులు మాట్లాడుతూ విమానాశ్రయం ద్వారా ప్రయణించే ప్రయాణికులకు అదనపు సౌకర్యాలు కల్పిస్తున్నట్లు వారు తెలియజేసారు. పర్యాటక శాఖ వారు మాట్లాడుతూ టూరిజం శాఖ ద్వారా విచ్చేసే భక్తులకు వసతి సౌకర్యం కోసం అదనపు వసతి గృహాలు అందుబాటులోకి తీసుకువచ్చామని తెలియజేసారు. ఎంపి గురుమూర్తి ఈ బ్రహ్మోత్సవాలకు చాలా విశిష్టత ఉందని బ్రహ్మోత్సవాలకి అందరూ విచ్చేసి శ్రీ వెంకటేశ్వరుని కృపాకటాక్షాలకు పాత్రులు కాగలరని ఎంపి గురుమూర్తి ఆహ్వానం పలికారు. ఈ సమీక్షలో విమానాశ్రయ, రైల్వే, ఆర్టీసి, పర్యాటక శాఖ అధికారులు, హోటల్ ఇండస్ట్రీ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నేడు సిఎంచే శ్రీనివాససేతు

# ప్రతిష్టాత్మక ప్రాజెక్టు ప్రారంభం



శ్రీనివాస సేతు పనులను చర్చిస్తున్న కమిషనర్ హరిత

తిరుపతి కార్పొరేషన్, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త
నేడు తిరుపతి నగరానికి ప్రతిష్టాత్మక ప్రాజెక్టు అయిన శ్రీనివాస సేతును ముఖ్యమంత్రి చేతుల మీదుగా ప్రారంభించుకోవడం ఎంతో సంతోషదాయకమని తిరుపతి నగర పాలక కమిషనర్ హరిత పేర్కొన్నారు. ఆదివారం ప్రారంభానికి సిద్ధం అవుతున్న శ్రీనివాస సేతు ప్రాజెక్టు పనులను నగర పాలక కమిషనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ వివరిస్తూ దాదాపు రూ. 650 కోట్లతో 6 కిలో మీటర్ల నిర్మాణం తిరుపతి స్మార్ట్ సిటి కార్పొరేషన్, టిటిడి సంయుక్తంగా నిర్వహించడం జరిగింది. శ్రీనివాస సేతు తిరుపతి, తిరుమల, యాత్రికులకు, నగర ప్రజలకు అందుబాటులోకి రావడం ఎంతో గర్వకారణంగా భావిస్తున్నామని తెలిపారు. ఈ శ్రీనివా సేతు వలన అటు శ్రీవారి భక్తులకు, ఇటు నగర ప్రజలకు ట్రాఫిక్ సమస్యలు తీరుతాయని అన్నారు. కమిషనర్ వెంట మున్సిపల్ ఇంజినీర్ చంద్రశేఖర్, అప్కాన్స్ ప్రతినిధి రంగస్వామి, ఏఈకామ్ ప్రతినిధి బాలాజీ, తదితరులు పాల్గొన్నారు.

**కలెక్టరేట్ సమావేశ మందిరంలో విశ్వకర్మ చిత్రపటానికి పూల మాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్**



# ఓ బొజ్జగణపయ్య..నీ బంటు నేనయ్య..





వినాయక బొమ్మలను కొనుగోలు చేసున్న దృశ్యం, పత్రి అమ్మకాలు

శ్రీకాళహస్తి,సెప్టెంబర్ 17 ప్రభాతవార్త
హిందువులకు మొదటి పండగ వినాయక చవితి. సాధారణంగా గ్రామాల్లో 'పిళ్ళారి చవితి పండగల్ని పిల్చుకొని వస్తుంది. ఉగాది ఊడ్చుకొని పోతుందని' చెబుతారు. ఈ ఏడాది నేడు సోమవారం వినాయక చవితి జరుపుకోబోతున్నారు. గ్రామాల్లో పండగంటే వారం ముందు నుంచి సందడి చోటు చేసుకుంది. అయితే గత రెండు సంవత్సరాలుగా కరోనా పండగలు, ఉత్సవాలకు శాపంగా మారింది. ప్రతి రోజు రాత్రి ఓ మోస్తారు వర్షం పడడంతో వినాయకవిగ్రహాల వ్యాపారులు ఆందోళన చెందినా వరుణుడు కరుణించడంతో కాస్తా వ్యాపారాలు ఓ మోస్తరుగా సాగాయి.శ్రీకాళహస్తి పట్టణంలోని చెన్నైరోడ్డులోని ధర్మరాజులగుడి ప్రాంగణంలోను, మిట్టకండ్రిగ, హౌసింగ్‌బోర్డు కాలనీల్లో భారీ వినాయక విగ్రహాలు తయారు చేసినా అమ్మకాలు సాగకూడదని ప్రకటించటంతో సాగిల పడ్డారు. మట్టి బొమ్మలకే పరిమితమయ్యారు. భారీ విగ్రహాల ఏర్పాటు ఎక్కడా కనబడలేదు.. జై భోళో..గణేష్ మహారాజ్‌కీ..జై అంటూ చిన్నా..పెద్దా.. తేడా లేకుండా తలకు రిబ్బన్లు కట్టుకుని సందడిచేయడం కనిపించింది. కాగా చవితి పండుగ సందర్భంగా పట్టణంలోపూల ధరలకు రెక్కలొచ్చాయి. భక్తిశ్రద్దలతో

**-నేడు వినాయకచవితి**

వినాయకచవితి పండుగను నిర్వహించుకునేందుకు జనం సన్నాహాలు చేసుకున్నారు.

**వ్యాపారాల సందడిః-**
వినాయక చవితి సంబరాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్దంచేశారు. పట్టణంలోని పెండ్లిమండపం, బేరివారి మండపం వద్ద ప్రత్యేక వినాయక ప్రతిమలను ఏర్పాటు చేసే వారు కానీ ఈ ఏడాది ఆ సందడి కరువైంది. ఈనేపథ్యంలో బాబు అగ్రహారం, పాతబస్టాండు, పానగల్‌లోని జిల్లాపరిషత్ బాలుర ఉన్నత పాఠశాలల వద్ద ప్రత్యేక దుకాణాలు వ్యాపారులు ప్రత్యేక దుకా ణాలు ఏర్పాటు చేశారు. వినాయకచవితి పూజలకు కావాల్సి న పత్రితో పాటు, పూజా కార్యక్రమాలకు వినియోగించే వాటిని విక్రయించారు.

## చిత్తూరులో చవితి సందడి

చిత్తూరుటౌన్, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: చిత్తూరు నగరంలో ఆదివారం వినాయచవితి సందడి నెలకొంది. నగర పరిధిలోని ప్రధాన వీధులైన చర్చివీధి, పొన్నియమ్మన్‌గుడి వీధి, బజారువీధి, కొంగారెడ్డిపల్లి, కట్టమంచి, గిరింపేట, సంతపేట తదితర ప్రాంతాల్లో ప్రజల సందడితో క్రిక్కిరిసిపోయాయి. బజార్లలో వినాయకుడి విగ్రహాల కొనుగోలుకు ప్రజలు ఎగబడ్డారు. చిన్నపాటి వినాయక విగ్రహం ఒకొక్కటి రూ.150 నుండి రూ.200 వరకు పలికింది. అలాగే వినాయక చవితి రోజున ఇళ్ళలో వినాయక విగ్రహాలను అలంకరించడానికి గొడుగులు, పూలు, పండ్లు, చవితి సామాగ్రి కొనుగోలు చేయడానికి ప్రజలు ఎగబడ్డారు. బజారు వీధి, పొన్నియమ్మన్ వీధుల్లో వ్యాపారులు వ్యాపారం చేశారు.



## చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు

# ఎమ్మెల్యే చెవిరెడ్డి మట్టి వినాయక విగ్రహాల పంపిణి

**పర్యావరణ రహితంగా మట్టి విగ్రహాలు పంఫిణి చేయడం హర్షణీయం**
**-ప్రజలకు వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపిన కలెక్టర్**
**-మట్టి గణపతులను పూజిద్దాం....పర్యావరణాన్ని పరిరక్షిద్దాం**
**-తుడ ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి**

తిరుపతిరూరల్, సెప్టెంబర్17 ప్రభాతవార్త:
పర్యావరణ హిత మట్టి వినాయకులను చంద్రగిరి నియోజకవర్గం ప్రజలందరికి అందించడం ఒక బృహత్తర కార్యక్రమం అని జిల్లా కలెక్టర్ వెంకట రమణారెడ్డి అన్నారు, పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తుడ ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిలు మట్టి వినాయక విగ్రహాల పంఫిణికి శ్రీకారం చుట్టడం హర్షణీయమని పేర్కొన్నారు. ఆదివారం తిరుచానూరు మార్కెట్ యార్డులో చంద్రగిరి నియోజకవర్గ ప్రజలకు ఉచితంగా మట్టి వినాయక విగ్రహాల పంఫిణి చేసే కార్యక్రమానికి ఎమ్మెల్యే భాస్కర్‌రెడ్డి, తుడ ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డిలతో కలిసి కలెక్టర్ ప్రారంభించారు. పర్యావరణాన్ని పరిరక్షించే బాధ్యత మనందరిపై ఉందని, నేడు చంద్రగిరి ఎమ్మెల్యే చెవిరెడ్డి తనయుడు తుడ ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి చొరవతీసుకుని భక్తితో పాటు పర్యావరణ పరిరక్షణ కూడా బాధ్యత తీసుకుని నియోజకవర్గంలోని 1లక్ష 15వేల వేల మట్టి విగ్రహాలు ఉచితంగా పంఫిణి చేయడం సంతోషదాయకమన్నారు. ప్రజలందరూ పర్యావరణహిత మట్టి వినాయకులనే వినియోగించాలని సూచించారు. తుడ ఛైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రకృతి హితమే పండగల పరమార్థమని, అందరూ మట్టి వినాయక విగ్రహాలనే పూజించి, పర్యావరణాన్ని పరిరక్షించాలని సూచించారు. ప్రతి పండగ వెనక పరమార్థం ఉంటుందని, ప్రకృతిలో మమేకమవుతూ ప్రకృతి శక్తులన్నింటిని ఆరాధించడం అనాధిగా మన సంస్కృతిలో భాగమన్నారు. పర్యావరణ హిత గణపతులకు ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి ప్రాధాన్యత ఇచ్చి 10 సంవత్సరాల క్రితమే కొత్త ఒరవడికి బీజం పడిందన్నారు. ప్రకృతికి ప్రజలకు సమాజానికి మంచి చేసే విషయంలో తాము ఎప్పుడూ ముందుంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, మార్కెట్ యార్డు ఛైర్మెన్ శ్రీవిద్య గణపతినాయుడు, పంచాయతీ కార్యదర్శి శంకర్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

# తిరుపతి డివిజన్

## ప్రధాని పేర శివయ్య సన్నిధిలో పూజలు,అభిషేకాలు:

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త



శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఆదివారం భారత ప్రధాని నరేంద్రమోదీ పేర రాష్ట్ర బిజెపి కార్యదర్శి, శ్రీకాళహస్తి నియోజకవర్గ ఇన్‌చార్జి కోలా ఆనంద్‌కుమార్ సారధ్యంలో బిజెపి నాయకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు జరిపించారు. పట్టణంలోనే కాకుండా చుట్టుపక్కల ఆశ్రమాల్లో సామాజిక కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో కోలా ఆనంద్‌కుమార్‌తోపాటు రాష్ట్ర మాజీ కార్యదర్శి కండ్రిగ ఉమ, పట్టణ అధ్యక్షుడు గరికపాటి రమేష్‌బాబు, ఓబిసి మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యులు ఉమాసింగ్, పట్టణ ఉపాధ్యక్షుడు లింగాబత్తిన గోపాల్, కిరణ్‌మణి, ప్రధాన కార్యదర్శులు మద్దు వాసుయాదవ్, పుణ్యం డిల్లి కుమార్, జి.సుబ్రమణ్యంమాజీరాష్ట్ర కార్యవర్గ సభ్యులు జివి అమర్‌నాథ్, సినీయర్ నాయకులు ఇమిడిశెట్టి మోహన్‌యువమోర్చాఅధ్యక్షుడుభరత్, చందురాయల్, రాజా, రమేష్‌నాయుడు తదితరులు పాల్గొన్నారు.

## మట్టివినాయకుల వితరణ

శ్రీకాళహస్తి రూరల్, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త



శ్రీకాళహస్తి మండలంలోని రామాపురం, రామలింగాపురం, భైరవ గిరిజన కాలనీ వాసులకు ఆదివారం యువనేస్తం సారధ్యంలో మట్టి వినాయకులను అందించారు. అధ్యక్షుడు మునిశేఖర్ సారధ్యంలో గిరిజన కాలనీ వాసులుకూడా అందరితో పాటు వినాయక బొమ్మలను ఏర్పాటు చేసి పండగ సంబరాలు జరుపుకోవాలనే లక్ష్యంతో వితరణ అందించినట్లు వివరించారు. ఈ కార్యక్రమాల్లో వాలంటీర్లు వెంకటేష్, హేమలత, ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు వినోద్, మండల కో ఆర్డినేటర్ నాగమణి, స్రవంతి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

## పోస్టు కార్డుల ఉద్యమం:

ఏర్పేడు (శ్రీకాళహస్తిరూరల్), సెప్టెంబర్ 17 ప్రభాతవార్త



రాష్ట్రంలో నెలకొన్న అప్రజాస్వామిక విధానాలతో తెలుగుదేశం నాయకుడు నారాచంద్రబాబునాయుడును అక్రమంగా అరెస్టు చేసి చేయని నేరానికి వారం రోజులుగా జైలులో ఉంచారని రాష్ట్ర కార్యదర్శి రెడ్డివారి గురువారెడ్డి ధ్వజమెత్తారు. ఈ అరాచకాలకు సంబందించి అక్రమ నిరసనలకు నిరసనగా పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. గ్రామగ్రామానికి తిరిగి ప్రజలను చైతన్యవంతుల్నిచేస్తూ ప్రచారం చేపట్టారు. మండలంలోని బండారుపల్లి గ్రామంలో ఆదివారం పోస్టు కార్డు ఉద్యమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమాల్లో మండల తెలుగుదేశం నాయకులు సుబ్బరామిరెడ్డి, రామచంద్రయ్య, సుబ్రమణ్యంయాదవ్, మునికృష్ణారెడ్డి, శివ, యువకులు హరి, గోవర్ధన్, శీను, మహేష్, సోమశేఖర్, కార్తీక్, వెంకటేష్, దివాకర్ తదితరులు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## మట్టివినాయకులతోనే కాలుష్యనివారణ

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త



యంగ్ ఎంప్లాయ్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో ఆదివారం శ్రీకాళహస్తి పట్టనానికి సమీపంలో ఉన్న రాజీవ్‌నగర్ కాలనీ, కొండమిట్ట, ఎఎంపుత్తూరు, ఇసుకదిబ్బ, వేడాంమిట్టకండ్రిగ గ్రామాల్లోసుమారు801 మట్టివినాయక ప్రతిమలను వితరణగా గ్రామస్తులకు, ప్రజలకు అందించారు. ఈసందర్భం గా యంగ్ ఎంప్లాయిస్ సోషల్ సర్వీస్ సంస్థ అధ్యక్షులు వి.హేమకుమార్ ఆధ్వర్యంలో సంస్థ సభ్యులు షరీఫ్, శ్రీను, చంద్ర, వెంకటేశ్వరరావు, ప్రదీప్‌కుమార్, రామయ్య తదితరులు కలిసి విగ్రహాలను పంపిణీచేశారు.

## మైనార్టీ నాయకుడు షాకిరాలీకి పరామర్శ



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త తెలుగుదేశంపార్టీ మైనార్టీ నాయకుడు షాకీరాలీ ఇటీవల గుండెపోటుకు గురై చికిత్స చేసుకుని తిరిగి ఇంటికి రావడంతో తెలుగుదేశంపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలవెంకటసుధీర్‌రెడ్డి, నాయకులు పాలసరఫరా మాజీ ఛైర్మన్ రావిళ్ళమునిరాజనాయుడు, రాష్ట్ర కార్యదర్శి దశరధాచారి తదితరులు ఆయన నివాసానికి చేరుకుని పరామర్శించారు. ఈసందర్భంగా ఆయన కుటుంబసభ్యులకు ధైర్యం చెప్పి తాము అండగా ఉంటామని ఆరోగ్యం జాగ్రత్తగా చూసుకోవాలని కోరారు.

## చంద్రబాబు విడుదల కోసం లూథరన్‌చర్చిలో ప్రార్ధనలు



**తొట్టంబేడు, సెప్టెంబర్ 19 ప్రభాతవార్త** తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు కడిగిన ముత్యంలా త్వరగా బయటకు రావాలని కోరుతూ ఆదివారం పట్టణంలోని కాసాగార్డెన్ సమీపంలో ఉన్న పురాతన లూథరన్‌చర్చిలో ఫాస్టర్ రె.మైకెల్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్ధనలు జరిపారు. వీరికి చర్చి అధ్యక్షులు మార్టిన్ లూథరన్‌బెంజిమన్ స్వాగతం పలికారు. చర్చలో నియోజకవర్గ ఇన్‌ఛార్జి బొజ్జలసుధీర్‌రెడ్డి, రాష్ట్ర కార్యదర్శి దశరధాచారి, పట్టణ అధ్యక్షుడు విజయకుమార్, పాలసరఫరా మాజీ ఛైర్మన్ రావిళ్ళమునిరాజనాయుడు, తిరుపతి పార్లమెంటు రైతు ఉపాధ్యక్షుడు ప్రకాష్‌నాయుడు, మాజీ మున్సిపల్ వైస్ ఛైర్మన్ మిన్నల్‌రవి, ఎస్‌సి సెల్ అధ్యక్షులు గోపి, పట్టణ ప్రధాన కార్యదర్శి కాసరం రమేష్, ఎస్‌టి సెల్ నాయకులు సుబ్బయ్య, అద్దంకి.కిట్టు, సన్నీ, వజ్రంకిషోర్ తదితరులు పాల్గొన్నారు.

## పండగపూట కూడా నీళ్ళులేక..

తొట్టంబేడు, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త



పండుగపూట కూడా పస్తులే అన్నట్లుగా అధికారుల తీరు మారింది. గత పదిరోజులుగా కాసరం పాత హరిజనవాడలో మంచినీ సమస్య ఉందని అధికారుల దృష్టికి తీసుకురావడంతో వారు స్పందించలేదు. దీంతో స్థానిక నాయకుడు కె.భరత్‌రెడ్డికి తెలపడంతో వెంటనే స్పందించిన ఆయన గత మూడు రోజుల క్రితం నుంచి మంచినీటిని సరఫరా చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు కొత్తబోరు వేశారు. కానీ నీరు రావడానికి ఆలస్యం అవుతుందని చెప్పడంతో పండుగరోజున ప్రజలు ఇబ్బందులు పడరాదని నాయకుడు భరత్‌రెడ్డి మంచినీటి సరఫరా చేస్తున్నారు. దీంతో గ్రామస్తులు ధన్యవాదాలు తెలిపారు.

## వైకాపాలోకి తెదేపా నాయకుల వలసల జోరు

**శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త** మండలంలోని రాచగున్నేరి గ్రామానికి చెందిన యువకులు



సుమారు 50మంది యువకులు పట్టణంలోని వైకాపా కార్యాలయంలో ఎంఎల్‌ఏ బియ్యపుమధుసూదన్‌రెడ్డి సమక్షంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ జగనన్న ప్రభుత్వం ప్రజల పక్షాన ఉంటూ ప్రజా సంక్షేమ పథకాలు తీసుకువచ్చి ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తుండడం పట్ల ఆకర్షితులై నేడు పార్టీలో చేరామని తెలిపారు. చేరిన వారిలో జ్ఞానగారి పోలయ్య, జి.పద్మశ్రీ,, జి.పద్మ, జి.మణి, సురేష్, మోహన్, మునిరత్నం, ఈగలమురుగయ్య, బాబు, గాయత్రి, స్వప్న, కిరణ్, నాధముని, బత్తెయ్య, పావని, బిందు, అశోక్, విజయలక్ష్మి, సుభాషిణి, ఈ.గుర్రమ్మ, సునీత, సుబ్బరత్నమ్మ, సోమశేఖర్, మునస్వామిశెట్టి, సుబ్బమ్మ, ఇంద్రశేఖర్, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

## శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త

శ్రీకాళహస్తి ప్రెస్‌క్లబ్ నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం జరిగింది. అధ్యక్షుడుగా ఎ.కామేష్(ప్రజాశక్తి), ప్రధాన కార్యదర్శిగా బి.చంద్రశేఖర్(సుమన్ టివి)లను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షుడిగా విసి వెంకటయ్య(వాస్తవపదం), ఉపాధ్యక్షులుగా వై.కోటేశ్వరబాబు(విశాలాంధ్ర), మునికృష్ణారెడ్డి(సిటీకేబుల్), సంయుక్త కార్యదర్శులుగా సి.మెహర్‌కుమార్(వార్త), టిసి.బత్తెయ్య(ఆంధ్రప్రభ), కార్యనిర్వాహక కార్యదర్శి గా బి.రవిరెడ్డి(మనం), కోశాధికారిగా కె.మునిమోహన్(సాక్షి), పిఆర్‌ఓగా యాసిన్(యువదర్శిని), ఏపిఆర్‌ఓ గా బాలాజీ(వి6), న్యాయసలహాదారుగా కె.సి.అంకయ్య(సూర్యబెల్స్), ప్రెస్‌క్లబ్ ఇన్‌ఛార్జిగా చాన్‌బేగం (జనంకోసం), గౌరవసలహాదారుగా బి.హరిబాబుయాదవ్(ఆంధ్రప్రభ), కార్యనిర్వాహక సభ్యులుగా కె.చంద్రశేఖర్, ఈశ్వరయ్యలు నియమితులయ్యారు. పాత్రికేయుల సంక్షేమంతో పాటు సమాజహితం కోరి ప్రెస్‌క్లబ్ పనిచేస్తుందని నూతన కార్యవర్గం తెలిపారు. కార్యక్రమంలో సీనియర్ పాత్రికేయులు ఎంవిరమణ, వి.శ్రీరాములు, ఈశ్వరయ్య, సి.వెంకటేష్, వి.రవి. టి.రామచంద్ర, రమేష్, హరీష్, రఫి తదితరులు పాల్గొన్నారు.

## అధికారంలోకి వచ్చాక అందరి లెక్కలు తేలుస్తాం - గాలి భానుప్రకాష్

**పుత్తూరురూరల్, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:** టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే అందరి లెక్కలు తేలుస్తామని నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ హెచ్చరించారు. పుత్తూరులో చంద్రబాబునాయుడును అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించడంతో చంద్రబాబుతో నేను కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన రిలే నిరాహారదీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో తండ్రి అధికారాన్ని అడ్డుపెట్టుకుని రూ.లక్ష కోట్లు ప్రజాధనం దోచేసి 16 నెలలు జైలులో ఉన్న వ్యక్తి నేడు నీతి వాక్యాలు వల్లించడం చూస్తుంటే జాలేస్తోందన్నారు. రాష్ట్రంలో అడ్డంగా వైసీపీ ఎమ్మెల్యేలు, మంత్రులు ఇసుక, మట్టి, గ్రావెల్ యథేచ్ఛగా అమ్ముకుంటూ అవినీతికి పాల్పడుతున్నారని విమర్శించారు. స్కిల్ డెవలప్‌మెంట్ స్కామ్‌లో ఎఫ్ఐఆర్ కాపీల్లో చంద్రబాబునాయుడు పేరు లేదన్నారు. అయినా కావాలనే ఆయనను అక్రమంగా అరెస్టు చేయించారన్నారు. ప్రతిపక్ష నేత జైలుకు వెళ్లే మంత్రి రోజా సంబరాలు చేసుకోవడంపై మండి పడ్డారు. ఈ సందర్భంగా టీడీపీ దళిత నాయకులు సుబ్రహ్మణ్యం, వేలు, శరవణ, ప్రకాష్, అజయ్‌లు, శిరోమండనం చేశారు. స్థానిక చర్చిలో టీడీపీ దళిత నాయకులు బాలాజీ, భూపాల్, మహేష్, తదితరులు ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు జీవరత్నంనాయుడు, జిల్లా బీసీసెల్ అధ్యక్షుడు షణ్ముగరెడ్డి, పట్టణ ప్రధాన కార్యదర్శి ధనపాల్, తుడా మాజీ ధనంజయలునాయుడు, మున్సిపల్ మాజీ చైర్మన్ యుగంధర్, టీడీపీ నాయకులు బాబునాయుడు, ప్రసాద్‌నాయుడు, శివ, ధనపాల్, కరుణ, గాలి గోపినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## బొబ్బరాజుపాలెంలో చంద్రబాబు విడుదల కోసం పూజలు

నారాయణవనం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త :

మండలంలోని బొబ్బరాజుపాలెం పంచాయతీలో తెలుగుదేశం పార్టీ నాయకులు అమ్మవారికి చంద్రబాబు పేరుపై అర్చన, అభిషేకం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా సత్యవేడు మాజీ ఎమ్మెల్యే హెచ్ హేమలత, సత్యవేడు నియోజకవర్గ టిడిపి ఇంచార్జీ డాక్టర్ హెచ్ హెలెన్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు ఎన్ భాస్కరన్, మండల క్లస్టర్ ఇంచార్జీ పి గిరిబాబు, గ్రామ పార్టీ అధ్యక్షులు సుబ్రమణ్యం, తిరుపతి పార్లమెంట్ బీసీసెల్ కార్యదర్శి కె వాసుదేవన్, యూనిట్ ఇంచార్జీ షణ్ముగం, నాయకులు రమేష్, శాంతి, కందస్వామినాయుడు, ఎస్ఎన్‌కందస్వామిమొదలియార్, కెఎస్‌రవి, లత, కృష్ణారెడ్డి, మోహన్‌రాజు, పొన్నుస్వామియాదవ్, రమేష్, నరేష్, శరవణ, లత, బాలసుబ్రమణ్యం, కిరణ్, గురవయ్య, రఘుపతిరెడ్డి, చంద్రశేఖర్, లోకయ్య, ఆలీ, సొరకాయలు, సురేష్, కార్యకర్తలు అందరు పాల్గొన్నారు.

## విశ్వం స్కూల్లో ముందస్తు చవితి సంబరాలు

తిరుపతి (మహిళావర్సిటీ), సెప్టెంబర్ 17, ప్రభాతవార్త



తిరుపతి జీవకోనలోని విశ్వం హైస్కూల్లో ఘనంగా ముందస్తు వినాయక చవితి పండుగ సంబరాలు ఆనందోత్సవాల మధ్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విశ్వం విద్యా సంస్థల అధినేత డాక్టర్ ఎన్. విశ్వనాథ్ రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు వినాయక చవితి పండుగ ప్రాముఖ్యత, మన సంస్కృతి, సాంప్రదాయాలను తెలియజేసారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. విద్యార్థినీ విద్యార్థులు పలు వేషధారణల్లో ఆకట్టుకున్నారు. ఈ వేడుకల్లో అకడమిక్ డైరెక్టర్ ఎన్. విశ్వచందన్ రెడ్డి, కరస్పాండెంట్ తులసి విశ్వనాథ్, ప్రధానోపాధ్యాయుడు సుబ్రమణ్యం, ఉపాధ్యాయిలు తదితరులు పాల్గొన్నారు.

## నడకతో గుండె పదిలం -డా॥చంద్రశేఖర్‌రెడ్డి

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:



ప్రతి రోజు కనీసం 2 కిలోమీటర్లైనా మనం నడవడం ద్వారా గుండెను పదిలంగా ఉంచుకోవచ్చని ప్రముఖ గుండె వ్యాధి నిపుణుడు డా॥చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం శ్రీ మారుతి హాస్పిటల్ ఆధ్వర్యంలో లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ మరియు ప్రకాశం పార్కు వాకర్స్ అసోసియేషన్ సహకారంతో డా॥చంద్రశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో గుండె సమస్యలపై అవగాహన సదస్సు, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండె సమస్యలు రాకుండా ఉండటానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన తగిన సూచనలు చేశారు. ప్రజలకు అవగాహన కల్పించడానికి మారుతి హాస్పిటల్ ద్వారా ఉచిత బేసిక్ లైఫ్ సపోర్ట్ ట్రైనింగ్ నిర్వహిస్తున్నామని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డా॥మారుతి కృష్ణ అన్నారు. అనంతరం లయన్స్ క్లబ్ ఆఫ్ తిరుపతి సెవెన్ హిల్స్ అధ్యక్షుడు ఆర్కాట్ కృష్ణప్రసాద్ మాట్లాడుతూ మానవుని శరీరంలో అతి ముఖ్యమైనది గుండె అని, దానిని పదిలంగా ఉంచుకునేందుకు నిత్యం నడక, యోగా, వ్యాయామం తప్పక చేయాలని సూచించారు. కార్యక్రమంలో హాస్పిటల్ మేనేజర్ జాన్ చౌదరి, మున్సిపల్ పార్కు వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్యదర్శి గోపినాథ్, లయన్స్ క్లబ్ కార్యదర్శి జగన్నాథం, బెల్లంకొండ సురేష్, సుబ్బయ్య, వెంకటముని, బాసికర్ల రఘు, యోగా వెంకటేష్, రామారావు, సాంబోలు హరి, మారుతి హాస్పిటల్ సిబ్బంది పాల్గొన్నారు.

## కస్తూర్బా గాంధీ ట్రస్ట్ ఆధ్వర్యంలో..

ఘనంగా ప్రధాని మోడీ జన్మదిన వేడుకలు

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:

ఆదివారం స్థానిక గాంధీరోడ్డులోని కస్తూర్బా గాంధీ కేంద్ర ట్రస్ట్ కార్యాలయం నందు ట్రస్ట్ చైర్మన్ డా॥పిసి.రాయులు ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 73వ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి జి.భానుప్రకాష్‌రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసి కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం ఆయన చేతుల మీదుగా వెయ్యి మంది పేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ట్రస్ట్ డైరెక్టర్ రుద్రరాజు శ్రీదేవి, బండి మధుసూధన్‌రెడ్డి, ఉదయగిరి కృష్ణమూర్తి, సుబ్రహ్మణ్యంరెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సినిమాలోలాగా గుడి సెట్లు వేయడం కాదు..

-శ్రీవారికి సతీమణితో కలిసి సిఎం పట్టు వస్త్రాలు సమర్పించాలి
-జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్ డిమాండ్

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:



ఈ ఏడాది సంక్రాంతి పండుగకు తాడేపల్లిలోని తన ఇంటి ముందు సినిమాలోలాగా భారీగా గుడి సెట్లు వేసి నిజమైన హిందువులు కూడా చేసుకోలేని విధంగా సంక్రాంతి సంబరాలను రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ఆయన సతీమణి భారతీరెడ్డి చేసుకున్నారు. ఇదే విధంగా నేడు తిరుమల శ్రీవారి బ్రహ్మోత్సవాల సందర్భంగా శ్రీవారికి పట్టు వస్త్రాలను సమర్పించడానికి ఆయన సతీ సమేతంగా తిరుమలకు రావాలని జనసేన తిరుపతి నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ కిరణ్‌రాయల్ డిమాండ్ చేశారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జనసేన నాయకులు రాజారెడ్డి, బత్తిన మధుబాబు, రాజేష్ ఆచారి, రమేష్‌నాయుడు, గుట్టా నాగరాజు, టిడిపి నేతలు ఆర్సీ.మునికృష్ణ, కరాటే చంద్ర, మహేష్ యాదవ్‌లతో కలిసి కిరణ్ మాట్లాడారు. స్థానిక ఎమ్మెల్యే, టిటిడి చైర్మన్ భూమన కరుణాకర్‌రెడ్డి జగన్‌ను ఒప్పించి ఆయన సతీమణి భారతీరెడ్డితో సహా తిరుమల బ్రహ్మోత్సవాలకు విచ్చేసేలా చేయాలని కోరారు. అలాగే ప్రతిపక్షాలైన జనసేన-టిడిపి నాయకులను సిఎం తిరుపతి రాక సందర్భంగా గృహ నిర్భంధాలు చేయకుండా, కనీసం వినియకచవితి పండుగనైనా తాము తమ కుటుంబ సభ్యులతో కలిసి ఆనందంగా చేసుకోవడానికి అవకాశం కల్పించాలని తిరుపతి పోలీసులకు విజ్ఞప్తి చేశారు.

## పిఎం,సిఎంలకు హోటల్స్ అసోసియేషన్ రుణపడి ఉంటాం

-ఏపి,తెలంగాణ రాష్ట్రాల హోటల్స్ అసోసియేష్ అధ్యక్షులు

తిరుపతి(విద్య) సెప్టెంబర్ 17 ప్రభాతవార్త:



ఆంధ్రప్రదేశ్‌లో టూరిజంను అభివృద్ధి చేయడంతో పాటు, హోటళ్లు, రెస్టారెంట్లను చిన్న పరిశ్రమ రంగాలుగా అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చిన దేశ ప్రధాని మోడీ, రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉంటామని రాష్ట్ర హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్‌వి.స్వామి వెంకట్‌రెడ్డి, తిరుపతి అధ్యక్షుడు వీరాంజనేయులు(చిల్లీస్ అంజి) తెలియచేశారు. ఆదివారం స్థానిక ఓ ప్రైవేట్ హోటల్లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ రాష్ట్రంలో హోటల్స్ యజమానులు ప్రధానంగా మూడు సమస్యలతో బాధపడుతున్నారని అన్నారు. మొదటగా రాత్రి 12 గంటల వరకు హోటల్స్ తెరిచి ఉంచుకోవచ్చని జీఓ ఉన్నా, పోలీసులు ఇబ్బంది పెడుతున్నారని వాపోయారు. రెండవది హోటళ్లను చిన్న పరిశ్రమలుగా గుర్తించిన విషయాన్ని మంత్రి రోజా ప్రోత్సాహం, సహాయ సహకారాలతో పిఎం, సిఎం, రాష్ట్ర పరిశ్రమల శాఖా మంత్రి, టూరిజం ప్రిన్సిపల్ సెక్రటరీల దృష్టికి తీసుకెళ్లిన విషయం ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈనెల 22న బెంగళూరులో దక్షిణ భారత ఉత్సవం కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. అనంతరం తిరుపతి హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఇందులో అధ్యక్షుడిగా చిల్లీస్ అంజి, సెక్రటరీగా నితిన్ చక్రవర్తి, ట్రెజరర్‌గా శ్రీహరితో పాటు సభ్యులను ఎన్నుకుని, వారిచేత ఘనంగా ప్రమాణ స్వీకారం చేయించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్రంలోని హోటల్స్ అండ్ రెస్టారెంట్స్ యజమానులు, ప్రతినిధులు, అసోసియేషన్ రాష్ట్ర సెక్రటరీ నాగరాజు, ట్రెజరర్ పూర్ణచంద్, జోనల్ ఉపాధ్యక్షుడు చిన్నపరెడ్డి, అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు బాలకృష్ణారెడ్డి, శ్రీనివాసులురెడ్డి, డిఆర్.కుమారస్వామిరెడ్డి, వీరాజ్ రాయల్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రధాని మోడీ మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకోవాలి

బిజెపి నాయకులు గుండాల గోపినాథ్ రెడ్డి



తిరుపతి రవాణా, సెప్టెంబర్ 17, ప్రభాతవార్త

దేశ ప్రధాని నరేంద్ర మోడీ 73వ జన్మదిన సందర్భంగా తిరుపతి గంగమ్మ గుడి శక్తి కేంద్ర బీజేపి ఇంచార్జి, గుండాల గోపినాథ్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. ముందుగా శ్రీ తాతయ్యగుంట అమ్మవారి ఆలయంలో, ప్రధాని నరేంద్ర మోడీ పేరిట అర్చన కార్యక్రమం నిర్వహించి ప్రత్యేక పూజలు చేసి అనంతరం పేదలకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గుండాల గోపినాథ్ రెడ్డి మాట్లాడుతూ తిరుమల శ్రీ వారి ఆశీస్సులతో, గంగమ్మ తల్లి చల్లని దీవెనలతో, ఆయురారోగ్యాలతో ప్రధానమంత్రి మోడీ మరిన్ని జన్మదిన వేడుకలు జరుపుకొని ప్రజలకు సేవ చేయాలని అభిలషించారు. ఈ కార్యక్రమంలో బిజెపి ధార్మిక సెల్ జిల్లా కన్వీనర్ అక్కిపల్లి మునికృష్ణ యాదవ్ బిజెపి 85 బూత్ అధ్యక్షురాలు విగ్రహాల కళ్యాణి బిజెపి తూర్పు మండల ఉపాధ్యక్షుడు తొండమనాటి సుబ్రమణ్యం రెడ్డి ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్, బిజెపి చంద్రగిరి మండల ప్రధాన కార్యదర్శి నరేష్ కుమార్ నాయుడు, నాయుడు బిజెపి నాయకులు మస్తాన్ యువరాజ్, పద్మనాభం లక్ష్మయ్య పాల్గొన్నారు.

## సిఎం రిలీఫ్ ఫండ్ నుంచి 9మందికి ఆర్థిక సహాయం

శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త



జన నాయకుడు, నిరుపేదల గుండెల్లో గూడు కట్టుకున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ప్రజల ఆరోగ్యానికి సంబంధించి పంపిన ప్రతి ఫైల్‌ను అమోదిస్తూ పేద ప్రజలను ఆదుకుంటున్నారని వైకాపా నాయకురాలు బియ్యపు పవిత్రారెడ్డి అన్నారు. ఆదివారం వైకాపా పార్టీ కార్యాలయంలో 9 మంది నిరుపేదలకు ముఖ్యమంత్రి రిలీఫ్ ఫండ్‌నుంచి మంజూరు అయిన చెక్కులను ఆమె అందించారు. 9 మందికి రూ.14,69,500ల చెక్కులను ఆమె అందించారు.

## వినాయక నిమజ్జన ప్రక్రియ నిర్వాహణకు రూ.25లక్షల తుడ నిధులు

– తుడ చైర్మెన్ మోహిత్‌రెడ్డికి అభినందనలు తెలిపిన నిమజ్జన కమిటీ సభ్యులు

తిరుపతిరూరల్, సెప్టెంబర్17 ప్రభాతవార్త:

నగరములో వినాయక నిమజ్జన ప్రక్రియ నిర్వాహణకు తుడ చైర్మెన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి రూ.25లక్షల రుపాయాల తుడ నిధులు కేటాయించడంపై వినాయక నిమజ్జన కమిటీ సభ్యులు హర్షం వెల్లబుచ్చారు. ఆదివారం తిరుచానూరు మార్కెట్ యార్డులో 1లక్షా 60వేల మట్టి వినాయక పంపిణి కార్యక్రమంలో నిమజ్జన కమిటీ సభ్యులు పాల్గొన్నారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగా ఎమ్మెల్యే చెవిరెడ్డి చంద్రగిరి నియోజకవర్గ ప్రజలందరికి మట్టి వినాయక విగ్రహాలను పంపిణి చేయడం అభినందనీయం అన్నారు. హైదరాబాద్, ముంబై తరహాలో వినాయక చవితిని తిరుపతిలో నిర్వహించడం అభినందనీయమని, నిర్వాహణ ప్రక్రియకు తుడ నిధులు మంజూరు చేయడం జరిగిందని తుడ చైర్మెన్ మోహిత్‌రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, వినాయక నిమజ్జన కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నగరి, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:



మండలంలోని వీకేఆర్ పురం గ్రామం బాలాజీ భవన్‌సమీపం జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో శ్రీనివాసన్(50) అనే వ్యక్తి మృతి చెందగా కృష్ణప్ప(60)కి తీవ్ర గాయాలయ్యాయి. సీఐ సురేష్ వివరాల మేరకు... తమిళనాడు తిరువళ్లూరు జిల్లా ఆర్‌కే పేట బాలాపురంకు చెందిన శ్రీనివాసన్, కృష్ణప్ప ద్విచక్రవాహనంలో నగరిలోని పెళ్లికి వచ్చి ఆదివారం వేకువ జామున తిరిగి వెళుతుండగా వీకేఆర్ పురం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీనివాసన్ అక్కడికక్కడే మృతి చెందగా కృష్ణప్ప తీవ్ర గాయాలపాలయ్యారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రునితో పాటు మృతదేహాన్ని నగరి ఏరియా ఆస్పత్రికి తరలించారు. కృష్ణప్ప పరిస్థితి విషమంగా ఉండడంతో తిరువళ్లూరు జీహెచ్‌కు తరలించారు. కేసు నమోదు చేసి ఢీకొన్న వాహనం కోసం విచారణ చేపడుతున్నారు.

## చంద్రబాబు విడుదల కావాలని అంజేరమ్మకు పూజలు

వడమాలపేట, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:



వడమాలపేట మండలం అంజేరమ్మ ఆలయంలో చంద్రబాబునాయుడుకు బెయిల్ మంజూరు కావాలని ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ నాయకుడు పోతుగుంట విజయబాబు మాట్లాడుతూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రి, ప్రతిపక్ష నాయకుడిగా పనిచేస్తున్న మచ్చలేనినాయుడు చంద్రబాబునాయుడు అన్నారు. తప్పుడు కేసులు పెట్టి జైలుకు పంపడం, జైలులో వేడి నీటి సౌకర్యం కూడా కల్పించకపోవడం దుర్మార్గమన్నారు. అక్రమ అరెస్టును ఖండిస్తున్నట్లు తెలిపారు. చంద్రబాబు విడుదల కావాలని అమ్మవారికి 108 కొబ్బరికాయలు కొట్టారు. యువత కార్యదర్శి సుమన్‌నాయుడు, రాష్ట్ర వాణిజ్య విభాగ కార్యదర్శి రవినాయుడు, సూపర్‌బజారు చైర్మన్ చంద్రయాదవ్, వైస్ చైర్మన్ పోతుగుంట రమేష్, డైరెక్టర్లు జలకం నవీన్‌కుమార్, శంకర్‌నాయుడు, అప్పయ్యనాయుడు, జిల్లా టీఎన్‌టీయూసీ కార్యదర్శి ప్రకాష్, మాజీ ఎంపీటీసీ ధనపాల్, వంశీ, బుల్లెట్ రమేష్, తాతినేని రాజా, తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ ద్రౌపదీదేవి ఆలయంలో వైభవంగా పట్టాభిషేకం

పుత్తూరురూరల్, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:



పుత్తూరు పట్టణంలోని శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల వార్షిక బ్రహ్మోత్సవాలు(తిరుణాళ్లు) అనంతరం ప్రతి ఏటా ఆనవాయితీగా పట్టాభిషేక కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఆలయ చైర్మన్ మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆలయంలో ఉదయం మూల ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు, అలంకరణలు చేశారు. అలాగే 9 గంటలకు శ్రీ ద్రౌపదీదేవి సమేత శ్రీ ధర్మరాజుల స్వామివారికి పట్టాభిషేకం మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. పై కార్యక్రమం దేవస్థానం కోవిల్‌గర్ల్ ద్వారా నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయ ఆవరణలోఅన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉభయ దాతగా ఎస్.ప్రకాష్‌రాజు, రమణమ్మ వారి కుమారుడు శ్రీ జుగల్‌కిషోర్ ప్రముఖ శైల్య వైద్యులు(ఈశ్వరాపురం) వ్యవహరించారు. అనంతరం స్వామివారిని అమ్మవారిని ప్రత్యేక పుష్పాలతో అలంకరించి పురవీధుల్లో ఊరేగించారు. సాయంత్రం ఆలయం వద్ద స్వీటు కారం కుమారు స్వీట్ స్టాల్ ఎం.సిద్దమల్లు చిత్ర పుత్తూరు వారి ఆధ్వర్యంలో నిర్వహించారు.

## పుత్తూరులో మోదీ జన్మదిన వేడుకలు

పుత్తూరురూరల్, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:



మన ప్రియతమ భారత ప్రధాని మోదీ జన్మదినాన్ని పురస్కరించుకుని స్థానిక భారతీయ జనతా పార్టీ సీనియర్ నాయకుడు కె.ఎన్.హరిబాబు ఆధ్వర్యంలో పుత్తూరు పట్టణంలోని కార్వేటినగరం రోడ్డులో ఈశ్వరగుడిలో మోదీ పేరున అభిషేకం జరిపి వారి ఆయురారోగ్యాలు కోసం ప్రార్థించారు. కార్యక్రమంలో టీచర్స్ సెల్‌కన్వీనర్ మేకల సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కోట కొండ బాబు, జిల్లా కార్యవర్గ సభ్యుడు కె.ఎన్.హరిబాబు, నాయకులు శేఖర్, భక్తవత్సలం, హరి, ఇతర నాయకులు పాల్గొన్నారు.

## చంద్రబాబు అరెస్టుతో బాధపడుతూ తెలుగుదేశం పార్టీ కార్యకర్త మృతి

పుత్తూరురూరల్, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:



పుత్తూరు మండలం తొరూరు గ్రామంలో ఆదివారం తెలుగుదేశం పార్టీ కార్యకర్త సీనియర్ నాయకుడు, ఆర్టీసీ రిటైర్డ్ ఎం.సుబ్రహ్మణ్యం ఆదివారం వేకువ జామున మృతి చెందాడు. ఆయన గత పది రోజులుగా బాబుని అక్రమంగా అరెస్టు చేసి ఈ దుర్మార్గమైన వైసీపీ ప్రభుత్వం వేధిస్తున్న పరిస్థితిని చూసి ఆయన భోజనం కూడా సరిగా చేయకుండా అదే ఆలోచనలో బాధపడుతుండేవాడు. అనునిత్యం దాన్ని తల్చుకుంటూ ఆయన వేకువ జామున 3 గంటలకు ఒక సారిగా కుప్పకూలి పడిపోయాడు. ఆయన మృతదేహానికి నగరి టీడీపీ ఇన్‌చార్జి గాలి భానుప్రకాష్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఆయన మృతి ఆత్మకు శాంతి కలగాలని మృతుని కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ఆ దేవదేవుని కోరి ప్రార్థిస్తూ కుటుంబ సభ్యులకు అన్ని వేళలా మేము అండగా ఉంటామని ఆయన భరోసా ఇచ్చారు. మండల పార్టీ అధ్యక్షుడు రవికుమార్ కుటుంబ సభ్యులకు అన్ని వేళలా మేము అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

## వైభవంగా ద్రౌపదిదేవి వేడుకలు

నిండ్ర, సెప్టెంబరు 17 ప్రభాతవార్త



మండల కేంద్రమైన నిండ్రలో వెలసిన ద్రౌపదిదేవి అమ్మవారి వేడుకలు ఆదివారం వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారికి పొంగళ్ళుపెట్టి, ప్రత్యేక అభిషేకాలు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. మధ్యాహ్నం అన్నధాన కార్యక్రమం నిర్వహించినారు. సాయంత్రం అమ్మవారిని విశేషంగా అలంకరించి, గ్రామంలోని పురవీదులలో భారీగా ఊరెగించినారు. ఈకార్యక్రమంలో భక్తులు అదిక సంఖ్యలో పాల్గొన్నారు.

## తపస్య పాఠశాలలో ఇంటర్నేషనల్ గోజు-ర్యూ కరాటే పోటీలు

రేణిగుంట, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:



రేణిగుంట డాక్టర్ బషీర్స్ తపస్య పాఠశాలలో ఇంటర్నేషనల్ గోజు-ర్యూ కరాటే పోటీలు(ఎల్లోబెల్ట్) నిర్వహించారని తపస్య అధినేత విక్రమ్ శాలీ ఆదివారం తెలియజేశారు. పోటీలు గ్రాండ్ మాస్టర్ సుందరం మూర్తి, దేవరాజులు మాస్టర్ల ఆధ్వర్యంలో జరిగాయి. పోటీల్లో తపస్య విద్యార్థులు 23 మంది పాల్గొన్నారు. కార్యక్రమంలో భాగంగా తపస్య డైరెక్టర్ అనూష విద్యార్థులను కరాటే మాస్టర్స్ ముకుంద, ఆనంద్‌ను అభినందించారు.

## ఓ బొజ్జ గణపయ్య నీ బంటు నేనయ్య

రేణిగుంట, సెప్టెంబరు 17 ప్రభాతవార్త:



రేణిగుంట శ్రీ చైతన్య టెక్నో స్కూలులో ముందస్తుగా వినాయక చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. విద్యార్థులు మట్టి ప్రతిమను పెట్టి భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. ఆది, సోమవారాలు సెలవు దినాలు కావడంతో శ్రీ వినాయక పూజను ముందుగానే చేశారు. రసాయన విగ్రహాలకు స్వస్తి పలికి మట్టి విగ్రహాలు ప్రతిష్ఠించి పూజలు చేయాలని పాఠశాల ఏజీఎం సురేష్, ప్రధాన చార్యులు హంసవేణి(అంసవేణి) విద్యార్థులకు పిలుపునిచ్చారు. నీరు, వాతావరణ కాలుష్యంపై వివరించారు. అనంతరం శ్రీ వినాయకస్వామికి హారతులు ఇచ్చి ప్రసాదాలు పంపిణీ చేశారు.

## కల్యాణవేంకన్న ఆలయంలో ప్రారంభమైన దేశికార్ల ఉత్సవాలు

**నారాయణవనం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త :** మండలకేంద్రంలోని నారాయణవనంలో ప్రసిద్ధి చెందిన టిటిడి అనుబంధ ఆలయం పద్మావతీదేవి సమేత కల్యాణవేంకటేశ్వరుని ఆలయంలో వెలసిన దేశికార్ల ఉత్సవాలు ఆదివారం నుంచి ఘన ంగా ప్రారంభమైనది. ఈ ఉత్సవాలు 10రోజుల పాటు జరుగుతుందని ఆలయ పర్యవేక్షకులు నాగరాజు తెలిపారు. ఉదయం స్వామి, అమ్మవారిని సుప్రభాత సేవలతో మేల్కొలిపి, శుద్ధి నిత్యపూజాది కార్య క్రమాలను నిర్వహించారు. అనంతరం సాత్తుమొర, బలి నిర్వహించిన తర్వాత పాలు, పెరుగు, నెయ్యి చ ందనం వంటి సుగంధద్రవ్యాలతో అభిషేకం చేసిన తర్వాత పుష్పాలతో సుమనోహరంగా అలంకరించారు. అనంతరం స్నపనతిరుమంజనం నిర్వహించారు. ఉదయం నుంచి రాత్రి 8గంటల వరకు భక్తుల రద్దీ తగ్గనే లేదు. భక్తులకు టిటిడి అధికారులు ప్రసాదాలను అందించారు.

# సత్యప్రమాణాలకు నెలవు... గణనాథుని కొలువు

## -నేటి నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు

**సత్యప్రమాణాలకు నెలవుగా... కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయం విరాజిల్లుతోంది. జిల్లా కేంద్రానికి సుమారు 12 కిలోమీటర్ల దూరంలో బహుదానది తీరంలో వెలసిన ఈక్షేత్రం రాష్ట్రంలోని ప్రముఖ పుణ్యక్షేత్రాలలో ఒకటిగా విరాజిల్లుతోంది. అనతికాలంలోనే ఎంతో అభివృద్ధి చెందిన ఈఆలయానికి వెయ్యేళ్ళ చరిత్రవుంది. ఈఆలయంలో సోమవారం నుండి స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు జరుగనున్నాయి.**



ప్రభాతవార్త – కాణిపాకం

పూర్వం విహారిపురి అనే గ్రామంలో ధర్మాచరణ పరాయణులైన ముగ్గురు సోదరులు వ్యవసాయం చేస్తూ జీవనం సాగించేవారు. పూర్వజన్మ కర్మఫలంగా పెద్దవాడు గుడ్డివాడుగా, రెండోవాడు మూగ, మూడోవాడు చెవిటివానిగా పుట్టారు. ముగ్గురు వికలాంగ సోదరులు తమ కర్మఫలాన్ని అనుభవిస్తూ... ఉన్నపొలాన్ని సాగు చేస్తూ జీవనం సాగించేవారు. ఈనేపథ్యంలో వర్షాలు లేకపోవడంతో గ్రామం కరువుతో తల్లడిల్లిపోయింది. గ్రామస్తులకు కనీసం త్రాగడానికి సైతం నీరు లేకుండా నానా అవస్థలకు గురయ్యారు. కరువును జయించడానికి ముగ్గురు సోదరులు తమ పొలంలోవున్న ఏతంబావిని లోతు చేయడానికి పూనుకున్నారు. బావిని తవ్వుతుండగా వీరికి ఓపెద్దరాయి అడ్డువచ్చింది. దీనిని తొలగించడానికి వీరు ప్రయత్నించారు. ఈప్రయత్నంలో చేతిలోని గడ్డపార సహాయంతో రాయిని తొలగిస్తుండగా గడ్డపార రాయికి తగిలి వెంటనే రాయి నుండి రక్తం చిమ్మింది. ఆరక్తం తాకడంతో సోదరుల అంగవైకల్యం తొలగిపోయింది. ఈవిషయాన్ని ముగ్గురు గ్రామాన్ని పాలిస్తున్న రాజుకు, గ్రామస్తులకు వివరించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న గ్రామస్తులు బావిని పూర్తిగా తవ్వి పరిశీలించారు. ఆబావిలో వినాయకుని రూపం కన్పించడంతో గ్రామస్థులు భక్తిశ్రద్ధలతో స్వామివారిని పూజించారు. భక్తులు సమర్పించిన కొబ్బరికాయల సమర్పణతో ఆ నీరు 'కాణి' భూమి పారింది. (కాణి అంటే ఎకరం పొలం అని అర్థం) కాణి మేరపొలం పారినందున ఈగ్రామానికి 'కాణిపారకమ్' అనే పేరు వచ్చింది. కాలక్రమంలో ఈగ్రామం కాణిపాకంగా మారింది.



కాణిపాకం ఆలయం

**ప్రమాణాల దేవుడుగా ప్రసిద్ధి:**

కాణిపాకం వినాయకుడు ప్రమాణాల దేవుడిగా ప్రసిద్ధి చెందారు. సాధారణంగా వివాదాల పరిష్కారానికి పోలీస్‌స్టేషన్‌కు గాని, న్యాయ స్థానాలకుగాని, మధ్యవర్తుల వద్దకు వెళ్ళి పరిష్కరించుకుంటారు. అయితే కాణిపాకంలో స్వామివారే న్యాయనిర్ణేత. స్వామివారి ఎదుట తప్పుడు ప్రమాణం చేస్తే స్వామివారే శిక్షిస్తాడని ఇక్కడి భక్తుల నమ్మకం. త్రాగుడు, దురలవాట్లకు బానిసలైనవారు స్వామివారి ఎదుట ప్రమాణం చేస్తే వాటికి దూరం అవుతారని ప్రతీతి. స్వామివారి ఎదుట సాధారణ ప్రమాణాలే కాకుండా రాజకీయ ప్రమాణాలు సైతం చేయడం విశేషం. గతంలో ఇక్కడ ప్రమాణాలను సైతం కోర్టులు కూడా ఏకీభవించేవని ఆధారాలున్నాయి.

**దినదిన ప్రవృద్ధుడు వినాయకుడు...**

కాణిపాకం వినాయకుడు నిత్యప్రవృద్ధుడుగా అలరారుతున్నారు. స్వామివారు నిత్యం పెరుగుతున్నాడనడానికి ప్రత్యక్ష నిదర్శనం వుంది. 1947లో భక్తులు తయారుచేయించి ఇచ్చిన వెండి కవచం ప్రస్తుతం సరిపోవడంలేదు. అలాగే 2000 సంవత్సరంలో తయారుచేసిన మరో వెండికవచం, 2005లో టీటీడీ మాజీ చైర్మన్ దివంగత డి.కె.ఆదికేశవులు తయారు చేయించిన కవచం కూడా ప్రస్తుతం స్వామివారికి సరిపోవడంలేదు. ప్రస్తుతం ఈమూడు కవచాలను భక్తుల సందర్శనార్థం ప్రాకార మండపంలో వుంచారు.

**శివవైష్ణవ ఆలయాల నిలయం:**

కాణిపాకం శివవైష్ణవ ఆలయాల నిలయం. ఇక్కడ శ్రీవరసిద్ధి వినాయకస్వామి ఆలయంతో పాటు అనుబంధ ఆలయాలుగా మరగదాంభిగా సమేత మణికంఠేశ్వరాలయం, శ్రీదేవి భూదేవి సయిత వరదరాజస్వామి ఆలయం, నవగ్రహ ఆలయంలు వున్నాయి. శివవైష్ణవ ఆలయాలు ఒకే చోట వున్న దేవస్థానం కాణిపాకం. దినదినాభివృద్ధి చెందుతున్న కాణిపాకం దేవస్థానంలో భక్తుల సౌకర్యార్థం కోట్లాది రూపాయల వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలు జోరుగా సాగుతున్నాయి.

## శ్రీకాళహస్తిలో ప్రత్యేక ఆకర్షణగా మేషరాశి' గణపతి




శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త : శ్రీకాళహస్తి పట్టణంలో పిళ్ళారి పండగ సంబరాలకు ముస్తాబౌతుంది. ఆదివారం మధ్యాహ్నం నుంచి స్థావరాలకు వినాయక విగ్రహాలను తరలించుటకు నిర్వాహకులు ప్రయత్నాలు ప్రారంభించారు. దాంతో నాలుగు మాడావీధుల్లో పలు మార్గ్లు ట్రాపిక్‌కు అంతరాయం కల్గింది. గత ఏడాది కన్నా ఈ ఏడాది పిళ్ళారి పండగ నిర్వహణకు యువకుల్లో ఉత్సాహం చోటు చేసుకుంది. ఇప్పటికే స్థావరాలను బ్రహ్మాండంగా తీర్చిదిద్దారు. శ్రీకాళహస్తి పుణ్యక్షేత్రంలో యువకులు పోటీలు పడి వినాయచవితి ఉత్సవాలు నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఈఏడాది శ్రీకాళహస్తి పట్టణంలో వివిధ రూపాల్లో గణపతి కొలువుదీరనున్నాడు. పర్యావరణానికి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్‌తో తయారైన బొమ్మలు వద్దు మట్టివినాయకులే ముద్దు అని కొన్ని సంస్థలు ర్యాలీలు కూడా నిర్వహిస్తున్నాయి. శ్రీకాళహస్తి పట్టణంలోని బాబు అగ్రహారం పురపాలక సంఘం ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులుగా విధులు నిర్వహించిన పోలస్వామి స్వర్ణమూర్తి రిటైర్డ్ అయిన తరువాత కూడా ధార్మిక కార్యక్రమాల్లో తమ భాగస్వామ్యం నిర్వహిస్తున్నారు. మేషరాశి గణపతిగా రూపొందించారు.

## నారాయణ స్కూల్‌లో చవితి సంబరాలు



శ్రీకాళహస్తి, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త : పట్టణంలోని నారాయణ పాఠశాలలో విచాయకచవితి సంబరాలు ఘనంగా నిర్వహించినట్లు ప్రిన్సిపాల్ జె.ఈశ్వర్యయ్య తెలిపారు. వినాయక ప్రతిమను ప్రతిష్టించి, నైవేద్యా సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఇందులో భాగంగా విద్యార్థినీ విద్యార్థు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. పాఠశాల ఎజిఎం కిశోర్, ఆర్ జె.సురేష్, ఉపాధ్యాయులు దీన్ దాము, వైస్ ప్రిన్సిపాల్ చూడామణి, కీర్తన, సురేష్, హుసేన్, చంద్రారెడ్డి, సుధాకర్ పాల్గొన్నారు.

## టిటిడి అటవీ కార్మికులకు న్యాయం చేయండి

తిరుపతి (మహిళావర్సిటీ), సెప్టెంబర్ 17 ప్రభాతవార్త : తిరుమల – తిరుపతి దేవస్థానంలోని అటవీ విభాగంలో 30 ఏళ్లుగా పని చేస్తున్న అటవీ కార్మికులందరినీ పర్మినెంట్ చేసి ఆదుకోవాలని సిఐటియు, అటవీ కార్మికుల యూనియన్లు సంయుక్తంగా ముఖ్యమంత్రి జన్మోహన్ రెడ్డికి విజ్ఞప్తి చేసారు. ఆదివారం ప్రెస్ క్లబ్‌లో విలేకరుల సమావేశంలో వాళ్లు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేత హోదాలో జగన్మోహన్ రెడ్డి అందరినీ రెగ్యులరైజ్ చేస్తామని ఇచ్చిన హామీని గుర్తు చేసారు. 2019వ సంవత్సరంలో వైవి సుబ్బారెడ్డి అధ్యక్షతన జరిగిన టిటిడి బోర్డు సమావేశంలో అటవీ కార్మికులందరికీ టైం స్కేలు అమలు చేస్తామని చేసిన తీర్మానం అమలుకు నోటుచోలేదన్నారు. 362 మంది కార్మికులలో జూనియర్లుగా ఉన్న 162మంది కార్మికులను పర్మినెంట్ చేసి మిగిలిన 200 మంది కార్మికులకు కనీసం టైంస్కేలు కూడా ఇవ్వకుండా లక్ష్మి శ్రీనివాసా కార్పొరేషన్‌లో కలిపి వేయాలనుకోవడం ఎంత వరకు సమంజసమన్నారు. తిరుమల కొండలలో మంటలు చెలరేగినప్పుడు చిరుతలు బక్తులపై దాడులకు తెగబడినప్పుడు, ఎర్రచందనం స్మగ్లర్లతో ఇబ్బందులు ఎదురైనప్పుడు ఈ కార్మికులు ప్రాణాలొడ్డి విధులు నిర్వర్తిస్తున్నారు. తిరుపతికి చెందిన ఎంఎల్ఎ కరుణాకర్‌రెడ్డి చైర్మన్‌గా బాధ్యతలు తీసుకున్న తరువాత కూడా అటవీ కార్మికులను పట్టించుకోకపోవడం దారుణమన్నారు. 1052 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న కార్మికులకు న్యాయం చేయాలని కోరారు. ఈ విలేకరుల సమావేశంలో టిటిడి ఫారెస్టు వర్కర్స్ యూనియన్ అధ్యక్షులు కె. సురేష్, ప్రధాన కార్యదర్శి బి. ఈశ్వర రెడ్డి, సంయుక్త కార్యదర్శి ఎ. కృష్ణమూర్తి, కోశాధికారి పి. సురేంద్ర, ఇసి సభ్యులు పాల్గొన్నారు.

## వెంకటగిరి వైసిపి పరిశీలకులు చంద్రశేఖర్‌రెడ్డికి ఘన స్వాగతం




వెంకటగిరిరూరల్ సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా వెంకటగిరి నియోజకవర్గం వైసిపి పరిశీలకులు ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డికి చిత్తూరు జిల్లా కుప్పంలోని ఏపిజిఈఎఫ్ ఆద్వర్యంలో అదివారం 4వేలు మంది ఉపాధ్యాయులతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్ర శేఖర్‌రెడ్డికి ఉపాద్యాయులు ఘన స్వాగతం పాటు పూలమాలలుతో ఘనంగా సన్మనించారు. అనంతరం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహనికి పూల మాలలు వేసి నివాళి అర్పించారు. అనంతరం గంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వాహించారు. ఉద్యోగులకు, కాంట్రక్ట్ అద్యాపకులకు, ఎయిడేడ్ ఉపాద్యాయులు. వైద్య విదాన పరిషత్. ఆర్టీసీ ఉద్యోగలకు కల్పించి ప్రయోజనంతో రాష్ట ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అన్ని సంఘల ఉద్యోగులు పాలభిషేకం చేసి ద్యాంకు సియం అంటూ నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎపిజిఈఎఫ్ రాష్ట చైర్మేన్ కాకర్ల వెంకటరామారెడ్డి, తదితరులు పాల్గోన్నారు.

## గ్రామ నడివీధుల్లో కొలువు దీరిన బొజ్జ గణపయ్యలు



నారాయణవనం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త : సోమవారం వినాయకచవితిని పురస్కరించుకొని వాడవాడల చవితి వేడుకలను పురస్కరించుకొని ఆదివారం రాత్రి అన్ని గ్రామాల్లోని నడివీధుల్లో కొలువుధీరారు. సోమవారం వినాయ చవితిని జరుపుకోవడం కోసం అన్ని ఏర్పాట్లను చేస్తున్నారు. ప్రతి గ్రామంలోను విగ్రహాలను ఏర్పాటు చేస్తున్నారు. సోమవారం గణనాధుడు భక్తులను నుంచి పూజలను అందుకోనున్నారు.

## వినాయక చవితికి సర్వంసిద్ధం

### - కొనుగోలుదారులతో నాయుడుపేటలో సందడి



నాయుడుపేట, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త : నాయుడుపేట ప్రాంతంలో వినాయక చవితి సందర్భంగా కొనుగోలు దారులతో సందడి వాతావరణం నెలకొంది. నాయుడుపేట పట్టణం కూడలి ప్రాంతం కావడంతో ఆదివారం చుట్టుపక్కల ప్రాంతాల నుంచి ప్రజలు అధిక సంఖ్యలో తరలివచ్చారు. పూజా సామగ్రి, వినాయక ప్రతిమల కొనుగోలుతో నాయుడుపేటలో సందడి నెలకొంది. ప్రజలు అధిక సంఖ్యలో తరలి రావడంతో బజారువీధి, వెల్‌కంసెంటర్, ఇతర వీధులు కిటకిటలాడాయి. సోమవారం వినాయక చతివి కావడంతో వినాయక ప్రతిమలు కొనుగోలు చేసేందుకు కమిటీల నిర్వాహకులు పలు వాహనాల్లో తరలివచ్చారు. వినాయక ప్రతిమలను వాహనాల్లో ఆయా ప్రాంతాలకు తరలించారు.

## ద్విచక్రవాహనాన్ని ఢీకొన్న కారు - ఒకరు మృతి, మరొకరికి తీవ్ర గాయాలు

పుత్తూరురూరల్, సెప్టెంబరు 17 ప్రభాతవార్త: ద్విచక్రవాహనాన్ని కారు ఢీకొన్న సంఘటనలో ఒకరు మృతి చెందగా మరొకరికి తీవ్ర గాయాలైన సంఘటన పుత్తూరు పట్టణ పరిధిలో ఆదివారం రాత్రి జరిగింది. ఏఎస్ఐ మార్కెండయ్య కథనం మేరకు... నాగలాపురం మండలం జానకాపురం దళితవాడకు చెందిన విజయగోపాల్(46), వజ్రవేలు(35) ద్విచక్రవాహనంలో స్వగ్రామం నుంచి తిరుపతి వస్తుండగా చెన్నై నుంచి తిరుపతికి వస్తున్న కారు వెనుక వైపు ఢీకొంది. ఈ సంఘటనలో విజయగోపాల్ అక్కడికక్కడే మృతి చెందాడు. వజ్రవేలు తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే పుత్తూరు ప్రభుత్వాస్పత్రికి తరలించి ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం తిరుపతికి తరలించారు. మృతి చెందిన విజయగోపాల్ తిరుపతిలో న్యాయవాదిగా పని చేస్తుండడం గమనార్హం. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

## ప్రభుత్వ ఉద్యోగులచే థ్యాంకూ సిఎం సార్ భారీ ర్యాలీ



కుప్పం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఉద్యోగుల ఫెడరేషన్ (ఎపిజిఇఎఫ్) రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకటరామిరెడ్డి అధ్వర్యంలో కుప్పంలో ఆదివారం థ్యాంకూసిఎం సార్ పేరిట భారీ ర్యాలీని నిర్వహించారు. స్థానిక శ్రీతిరుపతి గంగమ్మ ఆలయం వద్ద నుంచి ఈ ర్యాలీ బిసిఎన్ కళ్యాణ మండపం వరకు కొనసాగింది. ఈసందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను తీర్చుతున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఉద్యోగుల పాలిటి పెన్నిధి అన్నారు. కొత్తగా ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, పిఆర్‌సిలు, సిపిఎస్ స్థానంలో జిపిఎస్ పెన్షన్ సీ ౧౦, కారుణ్య నియామకాలు, అర్హత కలిగిన ఉద్యోగులకు పదోన్నతులు కల్పించిన ఘనత సిఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలపై సిఎం సానుకూల ధోరణితో నిర్ణయాలు తీసుకుంటున్నారన్నారు. ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నారన్నారు. అనంతరం స్థానిక బిసిఎన్ కళ్యాణ మండపంలో ఎపిజిఇఎఫ్ కార్యవర్గ సమావేశం, పిఆర్‌టియు రాష్ట్ర కార్యవర్గ సమావేశాలను నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రభుత్వ ఉద్యోగ, ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమాల్లో ఎమ్మెల్సీలు భరత్, పి. చంద్రశేఖర్‌రెడ్డి, కల్పలతారెడ్డి, పిఆర్‌టియు రాష్ట్ర అధ్యక్షుడు గిరిప్రసాద్‌రెడ్డి, జిల్లా ఎపిజిఇఎఫ్ కార్యదర్శి మల్లీశ్వరన్, టిటిడి సిపిఎస్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు చీర్ల కిరణ్, పిఆర్‌టియు నేతలు వెంకటేషన్, దేవరాజు, సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.






## కలెక్టర్ కార్యాలయ అద్దెను టిటిడి ఎందుకు వసూలు చేయడం లేదు?

### -విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు సాయిరెడ్డి ప్రశ్న



తిరుపతి(విద్య) సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: తిరుపతి జిల్లా కలెక్టర్ కార్యాలయంగా వినియోగిస్తున్న శ్రీ పద్మావతి నిలయం భవన సముదాయానికి గత 18 నెలలుగా ప్రభుత్వం అద్దె చెల్లించడం లేదు. ఎందుకు టిటిడి అద్దెను వసూలు చేయడం లేదని విశ్వహిందూ పరిషత్(విహెచ్‌పి) రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. సాయిరెడ్డి టిటిడి ఈఓ, చైర్మన్‌లను సూటిగా ప్రశ్నించారు. ఆదివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో విహెచ్‌పి రాష్ట్ర కార్యదర్శి కె.రాముడు, తిరుపతి నగర అధ్యక్షుడు దిండుకుర్తి నరసింహులు, తదితరులతో కలిసి ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం జిల్లా కలెక్టర్ కార్యాలయంగా వినియోగిస్తున్న పద్మావతి నిలయం భవనానికి నెలకు 21 లక్షల 43 వేల 860 రూ॥ల చొప్పున అద్దెను ప్రభుత్వం చెల్లించాలనేది ఒప్పందం. అయితే గత 18 నెలలుగా ప్రభుత్వం అద్దె చెల్లించ నందున సుమారు 4 కోట్ల వరకు శ్రీవారి ఖజానాకు నష్టం వాటిల్లిందని, దీనిని ఎవరు భర్తీ చేస్తారని ఆయన నిలదీశారు. దీనిపై ప్రభుత్వంపై ఒత్తిడి చేయక పోవడం టిటిడి పాలకమండలి నిర్లక్ష్య వైఖరికి అద్దం పడుతోందని మండ పడ్డారు. ఇది సరిపోదన్నట్లు కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న తాత్కాలిక సిబ్బంది వేతనాలు సైతం టిటిడి చెల్లించాలని, టిటిడిపై భారం మోపే ప్రయత్నం సాక్షాత్తూ కలెక్టర్ చేయడం బాధాకరమన్నారు. ఈ రెండింటినీ విహెచ్‌పి తీవ్రంగా ఖండిస్తోందని, తక్షణం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకొచ్చి ఇప్పటి వరకు రావాల్సి న 4 కోట్ల రూ॥లను వసూలు చేయాలని, లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమం చేయాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు.

## నిమజ్జనానికి పక్కాగా ఏర్పాట్లు చేయండి : కమిషనర్

తిరుపతి కార్పొరేషన్ 17, ప్రభాతవార్త : వినాయక నిమజ్జనానికి వినాయక సాగర్‌లో అన్ని ఏర్పాట్లు పక్కాగా చేయాలని ఇంజినీరింగ్ అధికారులను నగర పాలక సంస్థ కమిషనర్ హరిత ఆదేశించారు. నగర పాలక సంస్థ పరిధిలోని కరకంబాడి మార్గంలోని వినాయక సాగర్‌లో జరుగుతున్న ఏర్పాట్లను ఆదివారం సాయంత్రం కమిసనర్ పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ వినాయక విగ్రహాల నిమజ్జనానికి ఎటువంటి ఇబ్బందులు లేకుండా నీరు నింపాలని అన్నారు. విగ్రహాలను నిమజ్జనం చేసేందుకు క్రేన్లు ఏర్పాటు చేయాలన్నారు. విగ్రహాలతో తీసుకువచ్చే పూజా సామాగ్రి జాగ్రత్త తీయించన్నారు. వాహనాల రాకపోకలు కూడా జాగ్రత్తగా చూడాలన్నారు. గజ ఈతగాళ్లను అందుబాటులో ఉంచుకోవాలన్నారు. నిరంతరాయంగా విద్యుత్ ఉండేలా, విద్యుత్ దీపాలు ఏర్పాటు చేయాలని అన్నారు. అందరూ సమన్వయం చేసుకుని అన్ని ఏర్పాట్లు బాగా చేయాలని అన్నారు.

## 350 మందితో కాణిపాకం బ్రహ్మోత్సవాలకు బందోబస్తు

### -చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి



కాణిపాకం, సెప్టెంబర్ 17 ప్రభాతవార్త: కాణిపాకం శ్రీవరసిద్ధి వినాయకస్వామి దేవస్థానంలో జరుగనున్న స్వామివారి బ్రహ్మోత్సవాలకు 350 మంది సిబ్బందితో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు చిత్తూరు రూరల్ వెస్ట్ సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం సీఐ చిత్తూరు సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బందికి కాణిపాకంలో బ్రహ్మోత్సవ విధులను కేటాయించారు. అనంతరం ఆయన 'ప్రభాతవార్త' తో మాట్లాడుతూ దేవస్థానంలో సోమవారం నుండి అక్టోబర్ 8 వరకు స్వామివారి బ్రహ్మోత్సవాలు జరుగనున్నట్లు తెలిపారు. ఈఉత్సవాలకు రాష్ట్రం నుండే కాకుండా పొరుగు రాష్ట్రాల నుండి కూడా భక్తులు పెద్దఎత్తున తరలివచ్చే అవకాశముందని తెలిపారు. కావున ఉత్సవాలను ప్రశాంతంగా సజావుగా నిర్వహించడానికి భారీ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా ఇద్దరు డీఎస్పీలు, 9 మంది సీఐలు, 2326 మంది ఎస్ఐలతో పాటు ఏఎస్సై లు, హెడ్‌కానిస్టేబుళ్ళు, కానిస్టేబుళ్ళు, స్పెషల్ పార్టీ పోలీసులతో బందోబస్తు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈమేరకు ఆలయ వెలుపల, బయట ఆలయ భద్రత, శాంతి భద్రతల పరిరక్షణ, ట్రాఫిక్ నియంత్రణ కోసం ఈసిబ్బందిని నియమిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఆలయ పరిసరాల్లో ప్రస్తుతమున్న సీసీ కెమెరాలతో పాటు ప్రత్యేక నిఘా వుంచుతున్నట్లు సీఐ రవిశంకర్‌రెడ్డి తెలిపారు. ఉత్సవాల్లో ఎలాంటి తొక్కిసలాటలు, అవాంచనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. శాంతియుత వాతావరణంలో ఉత్సవాలను నిర్వహించడానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. ఇదిలా వుండగా జిల్లా పోలీసు అధికారులు కాణిపాకం ఆలయం వద్ద చేపట్టిన ఏర్పాట్లు, బందోబస్తును పరిశీలించారు.




